

ఎస్‌బీఐ ఎండీ అమరా మనవాడే

చినగంజాం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎండీగా మన తెలుగువ్యక్తి అమరా రామమోహన రావు నియమితులయ్యారు. ఆయనకు బాపట్ల జిల్లా చినగంజాంతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన దగ్గర బంధువు అమరా మోహన రావు అందించిన వివరాల ప్రకారం.. అమరా రామమోహనరావు తండ్రి రంగనాయకులు, తల్లి సామ్రాజ్యం. ప్రస్తుతం ఆమె చనిపోయారు. తండ్రి గతంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఉద్యోగరీత్యా చీరాలలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో రామమోహన్ జన్మించారు. ప్రస్తుతం రంగనాయకులు తెనాలిలోని కొత్తపేటలో ఉంటున్నారు. ఆయనకు కుమారుడు రామమోహన్, కుమార్తె ఉష ఉన్నారు. వారికి గతంలో చినగంజాంలో సొంత ఇల్లు ఉండేది. 20 ఏళ్ల క్రితం రంగనాయకులు తండ్రి చనిపోవడంతో దానిని అమ్ముకొని వెళ్లిపోయారు. రామమోహన్ చదువుకునే రోజుల్లో చినగంజాం అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవారని మోహనరావు వివరించారు.

సువర్ణ స్వాప్నికుడి అక్షర యజ్ఞం

విద్యా రంగాన జగన్నినాదం • నేడు జననేత పుట్టిన రోజు

చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని బలంగా నమ్మిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విద్యారంగానికి పెద్దపీట వేశారు. పేద బిడ్డల బంగారు భవితకు బాటలు వేశారు. వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మనబడి నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. ప్రతి బిడ్డ బడికి వెళ్లాలనే ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారు. ఏటా పుస్తకాలు, యూనిఫాం, షూతో కలిపి మొత్తం 10 రకాల వస్తువులతో విద్యాకానుక అందించారు. పేదింటి బిడ్డ దొరబాబులా ఇంగ్లిషు మీడియం చదవాలని బలంగా ఆకాంక్షించారు. అవాంతరాలు ఎదురైనా పట్టువీడలేదు.

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ విద్యావ్యవస్థను ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో కళకళలాడిన పాఠశాలలు... కూటమి పాలనలో నేడు వెలవెలబోతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు పైసా ఖర్చులేని నాణ్యమైన, ఆధునిక విద్యను ఉచితంగా అందించే మహత్తర లక్ష్యంతో వైఎస్ జగన్ అమలు చేసిన విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు ప్రపంచ స్థాయిని అందిపుచ్చుకున్నాయి. వాటి రూపురేఖలను మార్చివేసిన మహత్తరమైన మన బడి నాడు-నేడు కార్యక్రమం నేడు నిరాదరణకు గురైంది. దీంతో బడులు వెలవెలబోతున్నాయి. ప్రగతి పనులను అటకెక్కించిన కూటమి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో దారుణంగా విఫలమైంది. అమ్మ ఒడిని అమలు చేయకపోవడంతో ఫీజుల భారం తల్లిదండ్రులపైనే పడింది. ఆంగ్ల విద్యాబోధన, స్టూడెంట్ కిట్‌ల గురించి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. మరుగుదొడ్లు, పాఠశాలల ప్రాంగణాలు అపరిశుభ్రంగా మారినా కూటమి సర్కారుకు చీమకుట్టినట్లైనా లేదు.

ట్యాబ్‌లు ఎక్కడ?

గత వైఎస్సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వరుసగా రెండేళ్లపాటు అత్యాధునిక ఫీచర్లతో కూడిన బ్రాండెడ్ ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. వైఎస్ జగన్ పుట్టిన రోజున జగనన్న కానుక రూపంలో ఈ ట్యాబ్‌లను అందించి వారి ముఖాల్లో ఆనందోత్సాలను నింపారు. కానీ ఇప్పుడా రోజులు కనుమరుగయ్యాయి. గత రెండు విద్యాసంవత్సరాల్లో వరుసగా ట్యాబ్‌లు అందుకోగా, ప్రస్తుతం అది గత జ్ఞాపకంగా మారింది. 2022-23 విద్యాసంవత్సరంలో





గుంటూరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు (ఫైల్)

నాడు-నేడు కింద ఆధునీకీకరించిన ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బాలికలు

మొదటి విడతలో గుంటూరు జిల్లాలోని 181 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 12,127 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందాయి. రెండో విడతలో 2023-24 విద్యాసంవత్సరంలో 12,481 మందికి పంపిణీ చేశారు. ప్రీ లోడెడ్ కంటెంట్‌తో కూడిన రూ.33 వేల విలువైన ట్యాబ్‌లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది.

మారిన రూపురేఖలు

నాడు-నేడు మొదటి దశలో పాఠశాలలకు ఆధునిక హంగులు కల్పించి చదువుల విప్లవాన్ని తెచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకత చాటారు. ఆయన పుణ్యమాని ప్రభుత్వ పాఠశాలలు చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా సరికొత్త హంగులతో కళకళలాడాయి. నాడు-నేడు మొదటి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,183 పాఠశాలలను రూ.283 కోట్ల వ్యయంతో ఆధునికీకరించారు. రెండో విడతలో ఒక్క గుంటూరు జిల్లాలోనే 562 స్కూళ్లలో రూ.204 కోట్ల వ్యయంతో పనులు చేపట్టింది. గత వైసీపీ పాలనలో పక్కా ప్రణాళిక, పర్యవేక్షణతో కొనసాగిన ఈ పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేశారు. 165 పాఠశాలల్లో ప్రారంభించిన 584 తరగతి గదుల నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయాయి.

65 శాతానికి పడిపోయిన 'భోజనం'

పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద విజయవంతంగా కొనసాగింది. అప్పట్లో రోజూ పాఠశాలల్లో 90 శాతానికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఆరగించేవారు. ప్రస్తుతం అది 65 శాతానికి పడిపోయింది. తినని వారు ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు.

ఇప్పుడన్నీ పైపై మెరుగులే

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నడూ చూడని అభివృద్ధి సీఎంగా వైఎస్ జగన్ పాలనలో ప్రత్యక్షంగా కనిపించింది. బాలికల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన టాయిలెట్లను ఆధునికంగా తీర్చిదిద్దిన గత వైసీపీ ప్రభుత్వం వాటిలో బ్రాండెడ్ శానిటరీ సామగ్రి ఏర్పాటు చేసింది. 2014-19 మధ్య కాలంలో పాఠశాలల భవనాలకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించడం, మెరుగులు దిద్దడమొక్కటే గత టీడీపీ పాలనలో అభివృద్ధిగా చెప్పేవారు. ఈ నేపథ్యంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పాఠశాలల ముఖచిత్రం సమూలంగా మార్చివేశారు. పేరెంట్స్ కమిటీలకే బాధ్యతలు అప్పగించి, కొనుగోలు చేసిన ప్రతి సామగ్రికి ఈ కమిటీల ద్వారానే చెల్లింపులు చేశారు.

వైఎస్ జగన్ పాలనలో విద్యారంగం కళకళ

- నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక వెలవెల
- 'అమ్మ ఒడి'కి మంగళం పాడిన పాలకులు
- వైఎస్ జగన్ పుట్టినరోజున ఏటా విద్యార్థులకు ట్యాబ్‌లు
- నాడు – నేడుతో ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు
- ఆర్థిక భరోసాతో ప్రతి విద్యార్థి ఇంటా నాడు వెలుగులు
- గుర్తుచేసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

జగనన్న హయాంలో అమ్మఒడి పథకం లబ్ధిదారులు ఇలా..

విద్యా సంవత్సరం	లబ్ధిదారులు	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	1,46,232	219.35
2020-21	1,55,330	217.46
2021-22	1,40,102	210.15
2022-23	1,59,594	239.39
మొత్తం	6,01,258	886.35

జగనన్న విద్యాదీవెన అమలు ఇలా..

విద్యాసంవత్సరం	విద్యార్థులు	నిధులు(రూ.కోట్లలో)
2019-20	38,773	122.06
2020-21	42,079	93.85
2021-22	40,878	100.98
2022-23	38,252	80.35
వసతి దీవెన		
2019-20	36,157	34.73
2020-21	41,995	40.40
2021-22	40,863	36.45
2022-23	37,894	33.31

నాలుగేళ్లలో 5.21 లక్షల జేవీకే కిట్లు

గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత నాలుగు విద్యాసంవత్సరాల్లో 5,21,380 కిట్‌లను పంపిణీ చేశారు. దీనికి వైసీపీ ప్రభుత్వం రూ.95.96 కోట్లు వెచ్చించింది. ఏటా పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్ల పంపిణీని పండుగలా నిర్వహించింది. అన్ని రకాల సామగ్రిని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలిగించింది.

తల్లికి వందనం గురించి అడుగుతున్నారు



గత ప్రభుత్వం నాలుగేళ్లపాటు అమ్మఒడి అమలు పర్చడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తామని హామీ ఇచ్చిన తల్లికి వందనం డబ్బులు ఎప్పుడు ఇస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి అడుగుతున్నారు. నాడు-నేడు నిధులు విడుదల చేయడంతోపాటు ఆయాలకు ఆర్నెల్ల నుంచి బకాయి పడిన వేతనాలను తక్షణమే చెల్లించాలి.

– ఎం. కళాధర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గుంటూరు

నిధులు లేక మొండి గోడలు దర్శనమిస్తున్నాయి



నాడు-నేడు పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాలల్లో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన తరగతి గదులు అందుబాటులోకి రాక, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టాయిలెట్లు పూర్తి చేయాలి. తల్లికి వందనం నిధులు విడుదల చేయడంపై దృష్టి సారించాలి.

– కె. బసవ లింగారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, గుంటూరు

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 3,000 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,500

క్లుప్తంగా

జాతీయ రైఫిల్ షూటింగ్‌లో ముఖేష్‌కు స్వర్ణం



గుంటూరు వెస్ట్: ఢిల్లీలో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 67వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ స్వర్ణం సాధించాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో 600 పాయింట్లకు గాను 588 పాయింట్లు సాధించాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖేష్ పుణేలో ఒలిపిక్ పతక విజేత గగన్‌నారంగ్ వద్ద శిక్షణ పొందుతున్నాడని చెప్పారు. ముఖేష్‌కు ఏపీ రైఫిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సలలిత్, రాజ్‌కుమార్, కేఎల్‌యూ స్పోర్ట్స్ డీన్ హరికిషన్‌లు అభినందనలు తెలిపారు.

యార్డులో 53,675 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 46,813 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 53,675 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,415 బస్తాల మిర్చి నిల్వ ఉన్నాయి.

ప్రొటోకాల్‌పై రగడ



ప్రొటోకాల్ పాటించడం లేదని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం క్లిప్‌లను చూపుతున్న కార్పొరేటర్లు, చిత్రంలో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఏసురత్నం, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు

- కౌన్సిల్ సమావేశంలో రెండు గంటలపాటు సాగిన చర్చ
- టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతిపై విరుచుకుపడిన సభ్యులు
- ప్రజాప్రతినిధుల సూచనలతో బ్రిడ్జి డీపీఆర్ తయారీకి తీర్మానం



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధ్యక్ష స్థానంలో మేయర్ కావటి

సాక్షి ప్రతినిధి గుంటూరు, నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో వైఎస్సార్‌సీపీ పాలక వర్గం ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆ పార్టీ కార్పొరేటర్లను, ఏకంగా మేయర్‌ను ఆహ్వానించకపోవడం శుక్రవారం కౌన్సిల్ వేదికగా రెండు గంటలపాటు చర్చకు దారితీసింది. దీంతోపాటు టౌన్‌ప్లానింగ్ అవినీతి, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల ప్రక్షాళన, తాగునీటి అంశంపై సుదీర్ఘంగా చర్చ సాగింది. గోరంట్లలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు మేయర్‌ను ఆహ్వానించకపోవడంపై కార్పొరేటర్ మొహమూద్ ప్రశ్నించారు. దీనికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మద్దతుగా నిలిచారు. తమనూ పిలవడం లేదని ఆరోపించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పక్షానికి కొమ్ముకాస్తున్న అధికారులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోడియం దగ్గరకు వచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను తాము అధికారుల చుట్టూ తిరిగి చేయించుకుంటే ఎమ్మెల్యేలు టెంకాయ కొట్టి వెళ్లిపోతున్నారని కార్పొరేటర్లు బూసి రాజలత, మల్లవరపు రమ్య ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు సమాధానం ఇస్తూ ప్రొటోకాల్ అంశంపై ఒక ఫార్మెట్ రెడీ చేసి, ఆ విధంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మేయర్ మాట్లాడుతూ... అధికారులు ఇప్పుడు కొత్త రూల్స్ తీసుకొస్తున్నారని మండిపడ్డారు. నాయకుల మధ్య వివాదాలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్‌కు తెలియకుండా ప్రియాంబుల్స్ ఏ విధంగా పెడతారంటూ ప్రశ్నించారు.

టౌన్ ప్లానింగ్ విభాగంపై ఆగ్రహం

21వ డివిజన్‌లో అక్రమ కట్టడాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయని, అధికారులకు చెప్పినా కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని కార్పొరేటర్ గురవయ్య ప్రశ్నించారు. కార్పొరేటర్ చిష్టీ మాట్లాడుతూ అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వస్తే భవన యాజమాని వద్ద మామూళ్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏమైనా ఆధారాలు అందజేయాలని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం వలన చాలా వాణిజ్య సముదాయాలు నష్టపోయే ప్రమాదం ఉందని, వారికి నష్టపరిహారం గురించి తెలియజేయాలన్నారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయకుండా ఏవిధంగా సమావేశాలు నిర్వహిస్తారని కార్పొరేటర్లు వెంకటకృష్ణ (ఆచారి), బూసి రాజలత, ఇతర సభ్యులు ప్రశ్నించారు. స్థానిక ప్రజా ప్రతినిధులను కాదని స్టేక్ హోల్డర్స్‌తో మీటింగ్ ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన సమావేశాలకు ప్రజా ప్రతినిధులను పిలవకుండా డీపీఆర్ ఏ విధంగా సిద్ధం చేస్తారని అధికారులను ప్రశ్నించారు. అందరి భాగస్వామ్యంతో బ్రిడ్జి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు.

కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ మధ్యవర్తిత్వం



న్యాయమూర్తులతో జిల్లా జడ్జి పార్థసారథి, సంస్థ కార్యదర్శి లీలావతి తదితరులు

నగరంపాలెం: మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై జిల్లా కోర్టు ఆవరణలోని డీజే హాల్‌లో నిర్వహిస్తున్న నలభై గంటల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ సమస్య పరిష్కారంలో కక్షిదారులే కీలక పాత్రధారులని అన్నారు. న్యాయమూర్తులకు శిక్షణ ఇచ్చిన ఆర్.రత్నతార, సత్యరావు (తమిళనాడు)లను సత్కరించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

26 నుంచి వాలీబాల్ పోటీలు

గుంటూరు వెస్ట్: ఎన్టీఆర్ స్టేడియం వాలీబాల్ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఎమ్మిగోస్ జిల్లా స్థాయి టోర్నమెంట్ జరగనుంది. ఈ మేరకు నిర్వాహకుడు వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు ఈ నెల 26, 27 తేదీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. ఎంట్రీలను 78937 32893 నెంబర్‌కు పంపాలన్నారు.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలి



శంకర్‌విలాస్ ఫ్లై ఓవర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: శంకర్ విలాస్ సెంటర్లో త్వరలో నిర్మించనున్న ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. రోడ్లు, భవనాల శాఖాధికారులు, డీపీఆర్ కన్సల్టెన్సీలతో కలిసి రెండు డిజైన్లు రూపొందించారు. మొదటిది దాదాపు కిలోమీటరు పొడవుతో అరండల్‌పేట 10వ లైను నుంచి ఉమెన్స్ కాలేజీ వరకు ప్రతిపాదించారు. రెండోదానిలో హిందూ కళాశాల వరకు ప్రతిపాదన సిద్ధం చేశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా, మ్యాప్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మాణంలో ఐకానిక్ ఆర్కిటెక్చర్ ప్రతిబింబించేలా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లే వాహనాలకు ఇబ్బందులు రాకుండా ఫ్లైఓవర్ నిర్మాణంలో అండర్‌పాస్ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉమెన్స్ కాలేజ్ నుంచి ట్రాఫిక్‌కు అనుగుణంగా ప్రతిపాదనలు డిజైన్ చేయాలని చెప్పారు. దీని కోసం కాలేజీ వద్ద 24 గంటల సర్వే నిర్వహించి 24వ తేదీన నివేదిక అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథ రెడ్డి, రైల్వే డీఈఎస్ భరత్ కుమార్, కన్సల్టెన్సీ ప్రతినిధులు నరేంద్ర, ప్రణీత్, కుటుంబరావు పాల్గొన్నారు.

నాణ్యమైన ఇసుకను గుర్తించండి

గ్రామ, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలతో విస్తృత తనిఖీలు నిర్వహించి 5 హెక్టార్లు పైబడిన నాణ్యమైన ఇసుకను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వారంలోపే ఈ ఇసుక వివరాలు అందజేయాలన్నారు. లిటిగేషన్స్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు తరచూ సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన ఇసుకను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి డి.వెంకట సాయి, డీపీఓ బి.వి.నాగసాయి కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి క్రీడలూ కీలకం



క్రీడాజ్యోతి వద్ద తేజస్వి, రామకృష్ణమూర్తి, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ, రాష్ట్ర అభివృద్ధికి క్రీడలు, సాంస్కృతిక అంశాలు వంటివి దోహదం చేస్తాయని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలను 'ఆదర్శ్ 2024 స్పోర్ట్స్ ఫర్ హార్మనీ' పేరుతో శుక్రవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా తేజస్వి జాతీయ, క్రీడా పతాకాలు ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పావురాలను ఎగురవేశారు. తేజస్వి మాట్లాడుతూ... ప్రధాని మోదీ ఆశిస్తున్న అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్రీడాకారులు తయారవ్వాలని కోరారు. అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, పీవీ సింధు, హారిక వంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. చదువు నేర్పని అద్భుతాలు క్రీడలు, సాంస్కృతిక అంశాలు నేర్పుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములను ఆస్వాదించాలని వివరించారు. అనంతరం తేజస్వి బాలికల కబడ్డీ పోటీలను స్వయంగా ఆడి ప్రారంభించారు. విశిష్ట అతిథిగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రమణారావు, ఎంఎస్‌కే ప్రసాద్ వంటి క్రీడాకారులు హిందూ సంస్థల పూర్వ విద్యార్థులేనన్నారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. పోటీలకు 25 కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారని తెలిపారు. రెండు రోజులపాటు ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్ మాట్లాడుతూ.. క్రీడలతోపాటు మానసిక వికాసానికి దోహదపడే సాంస్కృతిక పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, డాక్టర్ కొల్లా సుస్మితా చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కోసూరి రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ బర్త్‌డే శుభాకాంక్షల ఫ్లెక్సీల తొలగింపు



తొలగించిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆటోకు కట్టుకున్న అభిమాని



కనకదుర్గ వారధిపై ఏర్పాటు చేసిన జెండాలు

- నగర పాలక సంస్థ అధికారుల అత్యుత్సాహం
- కూటమి నేతల ఫ్లెక్సీల తొలగింపునకు వెనకడుగు
- వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు



ఫ్లెక్సీలు, జెండాలను తొలగించి ఆటోలో వేసుకెళుతున్న కార్పొరేషన్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కార్పొరేషన్ అధికారులు అత్యుత్సాహం చూపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, జెండాలను శుక్రవారం సిబ్బంది తొలగించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు డిసెంబర్ 21వ తేదీన జరుపుకొంటుండగా.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు కనకదుర్గ వారధి, బైపాస్‌రోడ్, సర్వీస్‌రోడ్, తాడేపల్లి రోడ్డులోని ఇతర ప్రాంతాల్లో ఆయన ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, జెండాలను ఏర్పాటు చేశారు. పుట్టా ప్రతాప్‌రెడ్డి అనే అభిమాని ఏకంగా 2 వేల ఫ్లెక్సీలను, జెండాలను కనకదుర్గ వారధి వెంబడి ఏర్పాటు చేస్తే.. వాటిని పూర్తిగా తొలగించారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత వైఖరిలో భాగంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతోందంటూ వైఎస్సార్‌సీపీ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ ఫ్లెక్సీలు, జెండాలను ఏర్పాటు చేసిన దగ్గరే కూటమి నాయకులు ఏర్పాటు చేసిన అనేక ఫ్లెక్సీలు, జెండాలున్నాయని గుర్తుచేశారు. వాటిని తొలగించకుండా అధికారులు పక్షపాతం చూపుతున్నారంటూ మండిపడ్డారు.

క్రీడాస్ఫూర్తిని చాటేలా పోటీల నిర్వహణ



చాంపియన్‌షిప్ ట్రోఫీని అందిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: క్రీడా స్ఫూర్తిని చాటేలా పోటీలు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్పోర్ట్స్- గేమ్స్ మీట్ శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా రేంజ్ ఐజీ మాట్లాడుతూ నిత్యం బందోబస్త్, ఇతరత్రా విధుల నిమిత్తం బిజీగా ఉండే పోలీసులకు జిల్లా వార్షిక క్రీడా పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని చెప్పారు. దీనిని కొనసాగించాలని అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎనిమిది విభాగాలుగా సుమారు 180 మంది స్త్రీ, పురుష క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. గుంటూరు తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలోని హెడ్ క్వార్టర్ టీం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. తెనాలి సబ్ డివిజన్ టీంలోని 42 మంది మహిళలు, ఏఆర్ విభాగంలోని 36 మంది పురుషులు బంగారు పతకాలు సాధించారు. విజేతలకు ట్రోఫీ, బంగారు పతకాలను అందించారు. శిక్షణ ఐపీఎస్ అధికారిణి శ్రద్ధ, జిల్లా ఏఎస్పీలు హనుమంతు (ఏఆర్), రమణమూర్తి (పరిపాలన), ఏటీవీ రవిబాబు (ఎల్ఓ), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఆర్ఐలు శివరామకృష్ణ, ఉదయభాస్కర్, శ్రీహరిరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. కోచ్‌లు, రిఫరీలను ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

రేపు రేవేంద్రపాడు బ్రిడ్జి మూసివేత



బ్రిడ్జిని మూసి వేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రేవేంద్రపాడు బకింగ్‌హామ్ కెనాల్‌పై ఉన్న బ్రిడ్జిని ఈ నెల 22వ తేదీన తాత్కాలికంగా మూసివేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు శుక్రవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ.. ఈ బ్రిడ్జి రిటైనింగ్ వాల్ పూర్తిగా పాడైందని, దానిని తొలగించి ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ నెల 22వ తేదీ రాకపోకలు నిలిపివేసి ఈ మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ పరిసరాల్లో ఆంక్షలు

మంగళగిరి: జనవరి 10వ తేదీన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నిమిత్తం ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి జనవరి 12వ తేదీ వరకు నాలుగు వైపులా వీధులలో వాహనాలు అనుమతించబోమని పేర్కొన్నారు. పార్కింగ్ కోసం ఘాట్ రోడ్ పక్కన స్థలం అందుబాటులో ఉంటుందని, సీకే బాలికల హైస్కూలులో ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలో జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వ్యాపార కార్యకలాపాలతో కిక్కిరిసే ఏరియాలు, తరుచూ దొంగతనాలు జరిగే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) సమావేశ మందిరంలో శుక్రవారం సీసీఎస్ (సెంట్రల్ క్రైం సిస్టం) ఉన్నతాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని క్రైం పోలీసులు మరింత సమర్థంగా విధులు నిర్వహించాలని అన్నారు. సీసీఎస్ పోలీసులు చురుగ్గా ఉంటే దొంగల కదలికలు తగ్గుతాయని చెప్పారు. రాత్రివేళల్లో సంచరించే వ్యక్తుల వేలి ముద్రలను మొబైల్ ఫింగర్ ప్రింట్ స్కానింగ్ పరికరాలతో సేకరించాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులు ఛేదించాలని అన్నారు. సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, సీఐలు (డీసీఆర్‌బీ) నరసింహారావు, (సీసీఎస్) డి.వెంకన్నచౌదరి, సుబ్బారావు, అల్తాఫ్ హుస్సేన్, నరేష్‌కుమార్ (సోషల్ మీడియా), నిస్సార్‌బాషా (ఐటీ కోర్), సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలూ ముఖ్యం



మాట్లాడుతున్న శివశంకర్. వేదికపై తులసి యోగీష్ చంద్ర, అరుణ్‌కుమార్ తదితరులు

కొరిటిపాడు: నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. 'లఘు ఉద్యోగ భారతి' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి యోగీష్ చంద్ర అధ్యక్షతన శుక్రవారం 'ఎంఎస్ఎంఈ సంగమం 2024' కార్యక్రమం విజయవాడలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివశంకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... నూతన పారిశ్రామిక విధానంలో ప్రభుత్వం వాటి ఏర్పాటుకు అనుకూల వాతావరణం సృష్టించడంతోపాటు పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక భద్రత, అన్ని ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈ ఉద్యమ్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకొని ప్రోత్సాహకాలకు అర్హత సాధించాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమల సమస్యలను లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు మాదల వెంకటేశ్వరరావు వివరించారు. తులసి గ్రూప్ అధినేత తులసి యోగీష్ చంద్ర మాట్లాడుతూ ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడల్లో ప్లాట్స్ సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. పాపులర్ షూ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం 5 శాతం నుంచి 12 శాతానికి జీఎస్టీ పెంచటం తగదన్నారు.

ఏసుక్రీస్తు మార్గంలో నడవాలి



క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సర్వ మానవాళి సుఖ సంతోషాలతో జీవించాలంటే ఏసుక్రీస్తు చూపిన శాంతి, ప్రేమ మార్గాల్లో నడవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రైస్తవంలో ఉన్న ప్రేమ, కరుణ కులమతాలకతీతంగా అందరూ పాటిస్తే సమాజంలో ఎలాంటి విభేదాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యం, భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ మాదిగ కార్పొరేషన్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, డెప్యూటీ మేయర్ షేక్ షజిల, ఫాదర్ ఇన్నయ, పరదేశిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: మహా కుంభమేళా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఈ విషయం తెలిపారు.

- నంబర్ 07701 గుంటూరు – ఆజంగడ్ రైలు జనవరి 25వ తేదీన, 07702 ఆజంగడ్ – గుంటూరు రైలు 26న నడపనున్నట్లు తెలిపారు. గుంటూరు, కృష్ణా కెనాల్, విజయవాడ, కొండపల్లి, ఖమ్మం, వరంగల్, రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్, బలార్షా, చంద్రాపూర్, నాగపూర్ మీదుగా ఇవి ప్రయాణించనున్నాయి.
- నంబర్ 07719 గుంటూరు – గయా రైలు జనవరి 25వ తేదీన, 07720 గయా – గుంటూరు రైలు 27న నడవనున్నాయి. గుంటూరు, విజయవాడ, కొండపల్లి, మధిర, ఖమ్మం, డోర్నకల్ జంక్షన్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బలార్షా, చంద్రాపూర్, నాగ్‌పూర్ మీదుగా ఇవి రాకపోకలు సాగించనున్నాయి.